

మైనర్.. నో రయ్ రయ్

మైనర్లు వాహనం నడిపితే.. ఆ బండి ఎవరి పేరిట ఉంటే (తల్లిదండ్రులు, సంరక్షకులకు) రూ.25 వేల జరిమానాతోపాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. -8లో



ప్రాసెసింగ్ ఫుడ్‌కు ఫుల్‌స్టాప్

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు పండించే దిగుబడులకు అధిక ధర కల్పించేందుకు ప్రకృతి సేద్య విభాగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/24.4

జిల్లాలో శుక్రవారం 24.4 – 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డిజిటల్ పేమెంట్స్‌లో ప్రొద్దుటూరు ప్రథమం



మద్యం దుకాణంలోని సిబ్బందితో మాట్లాడుతున్న డిపో మేనేజర్ తిమ్మరాయుడు

ప్రొద్దుటూరు క్రైం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిర్వహిస్తున్న డిజిటల్ పేమెంట్స్ చెల్లింపులో ప్రొద్దుటూరు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ తిమ్మరాయుడు తెలిపారు. పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ లిక్కర్ డిపో పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, కమలాపురం, బద్వేల్, జమ్మలమడుగు నియోజకవర్గాల్లోని మద్యం దుకాణాల్లో గత నెలలో రూ.63.42 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలిపారు. మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడిన పలువురు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు, నకిలీ లేబుళ్లు, కల్తీ మద్యం విక్రయాలపై నిఘా పెట్టామన్నారు. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలకు మేరకు మద్యం విక్రయాలు జరపాలని సిబ్బందిని ఆదేశించారు.

12న రాజంపేటలో జాబ్‌మేళా

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12వ తేదీ ఉదయం పది గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. సీఎస్ఆర్ ఇనిషియేటివ్ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో11 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, టాటా స్ట్రైవ్ నుంచి సీనియర్ ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ మేనేజర్ మార్కండేయులు కూడా పాల్గొంటారని చెప్పారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానికల్ మోటార్ వెహికల్, సివిల్, వెల్డర్, మెకానిక్ డీజిల్, కంప్యూటర్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన వారితో పాటు ఈఏడాది ఆగస్టులో ఐటీఐ పరీక్షలు రాసే విద్యార్థులు కూడా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఇందులో పాల్గొనే వారు విద్యార్హత, ఆధార్‌కార్డు ఒరిజినల్, జిరాక్స్ కాపీలను, పాస్‌పోర్టుసైజు ఫోటోలను తమవెంట తీసుకురావాలని తెలిపారు. ప్రతిభగల వారికి ఆయా కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగు ఆరంభం..రైతు సంబరం

- నైరుతి ఆగమనంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- ముమ్మరంగా సబ్సిడీ విత్తనాల పంపిణీ
- వ్యవసాయ పనుల్లో బిజీగా రైతాంగం

కడప అగ్రికల్చర్: జూన్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. అలాగే నైరుతి రుతుపవనాల ఆగమనంతోపాటు ఉపరితల ఆవర్తనం తోడవడంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక రైతులు కాడీ, మేడీ సిద్ధం చేసుకుని సాగుకు సన్నద్ధమవుతున్నారు. అక్కడక్కడా దుక్కులు దున్ని పచ్చిరొట్ట విత్తనాల సాగు చేపడుతున్నారు. నీటి వసతి ఉన్న వాళ్ల నారుమడులు సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో వేరుశనగ పంట విత్తుతున్నారు. రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను అధికారులు పంపిణీ చేస్తున్నారు. రెండు, మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతు భరోసా కేంద్రాలలో విత్తనాల పంపిణీ ఊపందుకుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 530 క్వింటాళ్లకు పైగా పచ్చిరొట్ట విత్తనాలు, 2032 క్వింటాళ్ల వేరుశనగకాయలు పంపిణీ చేశారు. ఈ ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 75,189 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు. ఈ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా సాగు ఊపందుకోనుంది.

అధిక వర్షాలతో కుందూకు నీరు

ఉపరితల ఆవర్తనంతో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో కుందూనదికి నీరు వచ్చి చేరుతోంది. మొన్నటి వరకు రాజోలి ఆనకట్టలో 600 క్యూసెక్కులు ఉన్న నీరు గురువారం కురిసిన వర్షంతో రాజోలి నుంచి కుందూ నదిలోకి 7189 క్యూసెక్కులు వెళ్తోంది. దీంతో నదీ పరీవాహక ప్రాంతాల్లోని బోర్లలో నీరు పుష్కలంగా రానుంది. ఈ ప్రాంతాల్లో పంటల సాగు ఊపందుకోనుంది.

నగరానికి తీరిన మంచినీటి సమస్య

కుందూ నది నుంచి నీరు పెన్నాలోకి చేరి వాటర్‌గండికి వచ్చాయి. దీంతో కడప ప్రజల మంచినీటి సమస్య తీరింది. ఫలితంగా కడప నగర వాసులకు గతంలో మాదిరిగా నాలుగు రోజులకు ఒకసారి కాకుండా.. రోజు మార్చి రోజు మంచినీటిని విడుదల చేస్తున్నారు.



సిద్దవటం నదీ పరీవాహక ప్రాంతంలో వరి పంట సాగుకు ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

ఎరువులు సిద్ధం

ఖరీఫ్ సీజన్ మొత్తానికి కావాల్సిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎంఓపీ రకాల ఎరువులు 73,582 మెట్రిక్ టన్నులు అవసరంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో ఇప్పటి వరకు జిల్లాలో 38,739.93 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో అవసరాన్ని బట్టి ఆయా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించనున్నారు.



జిల్లాలో 75,189 హెక్టార్ల సాగు లక్ష్యం

ఖరీఫ్ –2024 సాధారణ విస్తీర్ణం 75,189 హెక్టార్లుగా వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు కావచ్చని వ్యవసాయ అధికారులు గుర్తించారు. ఇందులో కేసీ కెనాల్‌తోపాటు నీటి ఆధారంగా ఈ ఏడాది అత్యధికంగా 31,171 హెక్టార్లలో సాధారణ వరి పంట సాగు కానుంది. రెండో స్థానంలో 24086 హెక్టార్లలో పత్తి పంట సాగు అవుతుంది. 5971 హెక్టార్లలో వేరుశనగ, 3894 హెక్టార్లలో కంది, 1126 హెక్టార్లలో సన్‌ఫ్లవర్, 2642 హెక్టార్లలో మినుము, 1407 హెక్టార్లలో జొన్న, 1039 హెక్టార్లలో సజ్జ, 976 హెక్టార్లలో కొర్ర, 963 హెక్టార్లలో సోయాబీన్, 821 హెక్టార్లలో ఆముదం, 637 హెక్టార్లలో మొక్కజొన్న, 250 హెక్టార్లలో పెసలు తదితర పంటలు సాగు చేయనున్నారు.

విత్తనం	మంజూరు	రిజిస్ట్రేషన్స్		పంపిణీ	
	క్వింటాళ్లు	రైతులు	క్వింటాళ్లు	రైతులు	క్వింటాళ్లు
వేరుశనగ	5849	5721	4689	2860	3032.2
జీలుగలు	1800	5880	1677.7	1430	422
పిల్లపెసలు	130	137	35.2	82	19.44
జనుములు	3363	2597	788.3	332	88.8
మొత్తం	11,142	14,335	7,190.2	4,704	3,562.44

రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ



కమలాపురం మండలంలో వేరుశనగకాయలు రైతులకు పంపిణీ చేస్తున్న అధికారులు

జిల్లాలోని 36 మండలాల పరిధిలో 75,189 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు లక్ష్యంగా ఈ ఏడాది నిర్ణయించారు. దీని ఆధారంగా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అధికారులు సిద్ధం చేశారు. ఇందులో 5293 క్వింటాళ్ల పచ్చిరొట్టి విత్తనాలు, 5849 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను సబ్సిడీపై మంజూరు చేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు జీలుగలు, పెసలు, జనుముల కోసం 8614 మంది రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోన్నారు. వీరికి 2501.2 క్వింటాళ్ల కేటాయించగా.. ఇప్పటి వరకు 1844 మందికి 530.24 క్వింటాళ్ల జీలుగలు, జనుములు, పెసలు పంపిణీ చేశారు. వేరుశనగకాయలకు సంబంధించి 5721 మంది రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి 4680 క్వింటాళ్లు కేటాయించగా, ఇప్పటి వరకు 2860 మందికి 2032.2 క్వింటాళ్లు పంపిణీ చేశారు.

ఖరీఫ్ సందడి మొదలైంది



వర్షాల రాకతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులకు కావాల్సిన ఎరువులతోపాటు సబ్సిడీ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలలో విత్తనాల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది. ఈ వర్షంలో చాలా మంది పచ్చిరొట్ట విత్తనాలు, నీటి వసతి ఉన్న వారు నారుమడులు సాగు చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ పనుల సందడి మొదలైంది. – అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

విత్తనాల కొరత లేదు



మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య

కడప సెవెన్‌రోడ్స్: నైరుతి రుతుపవనాలు అనుకూలంగా ఉన్నందున జిల్లాలో వర్షాలు ప్రారంభమయ్యాయి. రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు సకాలంలో అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలని పలువురు జెడ్పీటీసీలు అధికారులను కోరారు. శుక్రవారం జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ పోరుమామిళ్ల చెరువు కింద వరి సాగుకు అవసరమైన జీలుగ విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. జిల్లాలో వేరుశనగ విత్తనాల సరఫరా సకాలంలో చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు సరఫరా చేయాలన్నారు. రాజీవ్‌నగర్ తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. వర్షం వస్తే పోరుమామిళ్ల బస్టాండు, అంబేడ్కర్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున నీళ్లు నిలువడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి బదులిస్తూ నారాయణి రకం వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తామని, విత్తనాలకు జిల్లాలోఎలాంటి కొరత లేదని తెలిపారు. రామాపురం జెడ్పీటీసీ వెంకట రమణ మాట్లాడుతూ తమ మండలంలో ఎనిమిది గ్రామాల్లో తాగునీటి రవాణా అవసరమున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, పశు సంవర్ధక, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘాల సమావేశం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ శారద, సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘం అధ్యక్షులు పుష్పలత, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డితోపాటు పలువురు జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

అభ్యసనతోనే ప్రాథమిక విద్య బలోపేతం



మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా డీఈఓ శివప్రకాష్ రెడ్డి

డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి: అభ్యసనతోనే ప్రాథమిక విద్య బలోపేతం అవుతుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి యు శివప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి డైట్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్లకు(డీఆర్‌పీ) శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా గత ఏడాది ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంలో పునాది) 60 రోజుల సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి డీఆర్పీలకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. తిరిగి జిల్లాలో ఎంపికైన 90 మంది డీఆర్పీలకు రెండు రోజుల రిఫ్రెషర్ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన డీఆర్పీలు తిరిగి మండలస్థాయిలో ఉన్నతాధికారులు నిర్ణయించిన తేదీల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటిరోజు స్టేట్ అబ్జర్వర్‌గా గిరిబాబు యాదవ్ శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. రిసోర్స్ పర్సన్ (కెఆర్‌పీ)లుగా ఉపేంద్ర కుమార్, శ్యామల దేవి, డైట్ లెక్చరర్ రెడ్డయ్యలు వ్యవహరించారు. శిక్షణను డైట్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రెండు రోజులుగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్ల రాజీనామా



రాజీనామా చేసిన కార్పొరేషన్ల డైరెక్టర్లు

ప్రొద్దుటూరు: జిల్లాలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, పూసల కార్పొరేషన్ తుపాకుల వెంకటరమణ, తొగట వీరక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చౌడం రవిచంద్ర, ఆరెకటిక కార్పొరేషన్ డైరెక్టర్ ఉమా మహేశ్వరి, నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ రాగా నాగలక్ష్మి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

స్టాఫ్‌నర్స్ నియామకాలపై సందేహాలు

వైద్య ఆరోగ్యశాఖ జోన్–4 పరిధిలో నవంబర్‌లో ప్రభుత్వం స్టాఫ్‌నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నాలుగు విడతలుగా నియామక ప్రక్రియ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఐదవ విడత నియామక ప్రక్రియ నిలిచింది. అర్హులైన అభ్యర్థుల్లో నియామక కౌన్సెలింగ్ నిలుపుదలతో సందేహాలు నెలకొన్నాయి.

- 5వ విడత కౌన్సెలింగ్ నిలుపుదల
- 206 మందికి సెలెక్షన్ జాబితా కొనసాగిస్తారా.. లేదా?
- అర్హులైన అభ్యరుల్లో ఆందోళన



వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: ప్రభుత్వం వైద్యరంగంలో పెద్ద ఎత్తున నియామకాలను చేపట్టింది. ఆ మేరకు కడప వైద్య ఆరోగ్యశాఖ జోన్–4 పరిధిలో పెద్ద సంఖ్యలో స్టాఫ్ నర్స్ నియామకాలను చేపట్టారు. ఫలితంగా వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగులుగా మారారు. తాజాగా రెండు రోజుల క్రితం చేపట్టిన స్టాఫ్‌నర్స్ నియామక కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిచిపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

10 వేలకు పైగా దరఖాస్తులు

వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం ద్వారా ఇప్పటికే వందలాది మంది నిరుద్యోగులు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా నియమితులయ్యారు. ఈ క్రమంలోనే నవంబర్ నెలలో ప్రభుత్వం మరో మారు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల నుంచి 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటి ఆధారంగా కార్యాలయ సిబ్బంది నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జాబితా తయారు చేశారు. ఆ జాబితా ఆధారంగానే విడతల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్హులైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఆ విధంగా ఒక్కో విడతకు వంద మందికి చొప్పున నాలుగు విడతలుగా నియామక కౌన్సెలింగ్ చేపట్టారు. 5వ విడతగా మదనపల్లి, పులివెందుల, ఆదోని మెడికల్ కాలేజీలకు 206 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో నియామక కౌన్సెలింగ్‌కు ఆటంకం ఏర్పడింది. తరువాత ఎన్నికలు ముగియడంతో ఇది వరకే రూపొందించిన అభ్యర్థుల ఎంపిక జాబితాతో నియామక కౌన్సెలింగ్ నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నియామకంపై కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వ్యక్తుల నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. అనంతరం ఉన్నతాధికారుల తర్జనభర్జనల తర్వాత నియామక కౌన్సెలింగ్‌ను నిలుపుదల చేశారు.

ఎంపిక జాబితానే కొనసాగిస్తారా?

ఎంపికైన అభ్యర్థులు కౌన్సెలింగ్ కోసం కడపకు వచ్చారు. కౌన్సెలింగ్ ప్రక్రియ నిలుపుదల కావడంతో వారిలో అనేక సందేహాలు నెలకొన్నాయి. 5వ విడత ఎంపిక చేసిన జాబితా ప్రకారం కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారా. లేక కొత్తగా వచ్చే ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ ఏమైనా జారీ చేస్తుందా..? అనే సందేహాలు అభ్యర్థుల్లో నెలకొన్నాయి. ఒకవేళ కొత్తగా ఏర్పడే ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేస్తే, మెరిట్ ఆధారంగా ఇప్పటికే ఎంపికైన తమకు ఉద్యోగం దక్కదేమోనని ఆందోళన వారిలో నెలకొంది. ఈ విషయమై ఎంపికైన అభ్యర్థులు సంబంధిత అధికారులను ఆరా తీశారు. అయితే ఇందుకు సంబంధించి అధికారుల వద్ద స్పష్టమైన సమాచారం లేకపోవడంతో అభ్యర్థులకు ఎలాంటి భరోసా ఇవ్వలేక పోయారు. కాగా సాంకేతిక కారణాలు, ఇతర సమస్యలు ఏమైనప్పటికీ నిబంధనల ప్రకారం 5వ విడతలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అనుసరించి అర్హులకు ఉద్యోగాలు దక్కాల్సి ఉంది. కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు.

జోరు వాన



మండలం	కురిసిన వర్షం(మి.మీ)	మండలం	కురిసిన వర్షం(మి.మీ)
కడప	51.2	పులివెందుల	8.0
చక్రాయపేట	36.0	తొండూరు	6.4
వేముల	304	పెండ్లిమర్రి	6.2
చాపాడు	29.6	బి.కోడూరు	6.2
వల్లూరు	20.4	వేముల	5.4
ఎర్రగుంట్ల	15.8	సిద్దవటం	4.2
కమలాపురం	15.2	కలసపాడు	3.2
ప్రొద్దుటూరు	14.0	దువ్వూరు	2.4
మైదుకూరు	12.6	చెన్నూరు	2.0
సికెదిన్నె	12.2	రాజుపాళెం	1.6
సింహాద్రిపురం	10.2	ఖాజీపేట	1.6
పోరుమామిళ్ల	9.8	అట్లూరు	1.2
ముద్దనూరు	9.4	ఒంటిమిట్ట	1.2
కొండాపురం	8.4	గోపవరం	1.0



కడపలో జలమయం అయిన ఆర్టీసీ బస్టాండు పరిసర ప్రాంతాలు (ఇన్‌సెట్) అప్సర సర్కిల్ సమీపంలో నిలిచిన వర్షపునీరు

కడప అగ్రికల్చర్/కడప కార్పొరేషన్: ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. గురువారం రాత్రి బద్వేలు, బి.మఠం, కాశినాయన, జమ్మలమడుగు, పెద్దముడియం మండలాలు మినహా మిగతా అన్ని మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో కడపలో అత్యధికంగా 51.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కడపలో దంచికొట్టింది: కడప నగరంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వాన కొద్దిసేపే కురిసినా.. పెద్ద ఎత్తున నష్టం చేకూర్చింది. డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లాయి. ఆర్టీసీ బస్టాండు జలమయం అయింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్టాండు, జిల్లా కోర్టు, ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్, కోటిరెడ్డి సర్కిల్ ప్రాంతాల్లో భారీ స్థాయిలో వర్షపు నీరు నిలవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపునీరు ఎటూ పోయేందుకు మార్గం లేకపోవడంతో కోటిరెడ్డి సర్కిల్ నుంచి మురళీ థియేటర్ వైపుగా బుగ్గవంక వరకూ జేసీబీలతో కాలువ తీసేందుకు పనులు సాగించారు. నగరంలోని పలు లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. ఆయా ప్రాంతాల్లో జన జీవనం స్తంభించింది. నగర శివారు ప్రాంతాలైన రామాంజనేయపురం, వరదకాలనీ, ఆచారి కాలనీ, జర్నలిస్టుకాలనీ, ఏఆర్‌పీ కాలనీ, దండోరా కాలనీ, తిలక్‌నగర్, ఆర్‌కే నగర్, ఎస్‌బీఐ కాలనీ, నకాష్, బండ్లమిట్ట, శాస్త్రినగర్, అక్కాయపల్లె, గంజికుంట కాలనీ, గౌస్ నగర్, అశోక్‌నగర్, ప్రకాష్‌నగర్, నిరంజన్ నగర్ తదితర కాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మట్టి రోడ్లు ఉన్న శివారు ప్రాంతాల్లోని జనం బురదలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల విద్యుత్ లైన్లు, స్తంభాలు దెబ్బతిన్నాయి.



కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో..



బస్టాండు బయట రోడ్డుపై పారుతున్న నీరు



ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్ ఎదుట..

నూతన నియామకం

మదనపల్లె: ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన పీటీఎం.శివప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.హరిబాబు, శివప్రసాద్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

చాపాడు : మండలంలోని అయ్యవారిపల్లె పంచాయతీ రామదాసుపురం గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరు మండలం కల్లూరు సమీపంలోని పెన్నానది నుంచి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు చాపాడు పోలీసులు దాడి చేసి ట్రాక్టర్లు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన ఉదయకుమార్

జమ్మలమడుగు రూరల్ : అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జమ్మలమడుగు మండలంలో చోటుచేసుకొంది. పట్టణ ఎఎస్ఐ మురళీమోహన్ వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలపరిధిలోని గొరిగెనూరు గ్రామానికి చెందిన ఇంజేటి ఉదయ్‌కుమార్ (30) బేల్దారి పనులు చేసుకొని జీవిస్తున్నారు. మూడు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన అతడు పనులకు వెళ్లలేకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఇంట్లో భార్య, భర్త మధ్య గొడవలు జరిగాయి. ఏమి చేయాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. భార్య సలోమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగలు



డీలర్‌తో మాట్లాడుతున్న అధికారులు

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని కట్ట స్టేజీ వద్ద 11 కేవీ విద్యుత్ వైర్లు తెగి పడ్డాయి. శుక్రవారం రాత్రి వీచిన గాలులకు ప్రధాన రహదారి పక్కనే చెట్టు కూలి 11కేవీ విద్యుత్ తీగలపై పడింది. వర్షం కురడంతో విద్యుత్తు సరఫరా ఉంటుందని రహదారిపై వాహనాలు వెళ్లకుండా ఇరువైపులా భారీ సంఖ్యలో నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్తు సరఫరా నిలిపివేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె : పనులకు వెళుతున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి గొలుసు చోరీ చేసిన ఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. వలసపల్లె కాలనీకి చెందిన పి.లావణ్య(37) బండకిందపల్లె వద్ద ఉన్న డీకే.గ్రానైట్స్‌లో పనిచేస్తోంది. తన సహాయకురాలు దేవిశ్రీతో కలిసి శుక్రవారం ద్విచక్ర వాహనంలో విధులకు బయలుదేరింది. మార్గమధ్యంలో 150వ మైలు వాణి బిల్డింగ్ సమీపంలో పాల ప్యాకెట్లు కింద పడిపోవడంతో, వాహనం ఆపి తీసుకుంటుండగా, వెనుక నుంచి ద్విచక్ర వాహనంలో వ్యక్తి ఆకస్మాత్తుగా వచ్చిన వ్యక్తి మెడలో గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని చోరీ ఘటనపై ఫిర్యాదుచేసింది. గొలుసు 20 గ్రాముల బరువు ఉందని, విలువ రూ.96 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదుచేసినట్లు సీఐ ఎస్.శేఖర్ తెలిపారు.

మైనర్.. నో రయ్ రయ్



- జూన్ నుంచి అమల్లోకి వాహన చట్టం
- మైనర్లకు వాహనాలు ఇస్తే జైలు
- మందుబాబులకు భారీగా జరిమానా

గతంలో చట్టం నిబంధనలు..

గతంలో వాహన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిచ్చినపుడు ప్రమాదాలకు గురైతే రూ.1000 జరిమానా విధించారు. నేరం నిరూపితమయ్యే వరకు జువైనల్ కోర్టుకు బాలుడు ప్రతి శుక్రవారం హాజరయ్యే ప్రక్రియ ఉండేది. బాధితుల తరఫున వారు.. బాలుడి తరఫున వారు మాట్లాడుకునే వెసులుబాటును బట్టి ఉండేది. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి గతంలో రూ.2వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష ఉండేది.

సవరించిన చట్టం ప్రకారం..

నూతన సవరించిన వాహన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిస్తే ఆ బండి ఎవరి పేరిట ఉంటే (తల్లిదండ్రులు, సంరక్షకులకు) రూ.25 వేల జరిమానాతోపాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. తాజాగా సవరించిన చట్టం ప్రకారం మద్యం తాగి వాహనాలు నడిపేవారికి రూ.10వేల జరిమానాతోపాటు ఆరు నెలల జైలు శిక్ష ఉంటుంది. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ నిబంధనలు అమలులోకి వచ్చాయి.

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	825	307	970
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024 ఇప్పటి వరకు	214	100	233

కడప వైఎస్సార్ సర్కిల్ : రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహన దారులపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. జిల్లాలో 2020 నుంచి ఇప్పటి వరకూ 3332 ప్రమాదాలు చోటు చేసుకోగా 1550 మంది మృతి చెందారు. సుమారు 3719 మంది క్షతగాత్రులయ్యారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ నిండు ప్రాణాలు పోవడానికి కారణమవుతున్న మైనర్లు బైక్ నడపకుండా చెక్ పెట్టింది. వయస్సు అనుమతి లేకపోయినా రయ్ మంటూ పోనిస్తూ పాదచారులు, వాహదారులను వణికిస్తున్న వారిని హెచ్చరిస్తూ వాహన చట్టం సవరించి జూన్ ఒకటో తేదీ నుంచి అమలులోకి తెచ్చింది. రహదారిపై సురక్షిత ప్రయాణం ఉండాలనే సంకల్పంతో ఈ చట్ట సవరణకు ఆమోదం తెలిపింది.

వాహన చట్టానికి సవరణ

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అమలులో ఉన్న వాహన చట్టంలో కొన్ని మార్పులు తెచ్చింది. 2019 సెప్టెంబర్, 01న నూతన చట్టం అమల్లోకి తెచ్చి.. వాహన దారులకు విధించే జరిమానాల్లోనూ భారీ మార్పులు తెచ్చింది. అయినప్పటికీ మైనర్లు బైక్ నడుపుతూ అమాయకుల ప్రాణాలు పోవడానికి కారణమవుతున్నారు. మందుబాబులు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలో ఈ మధ్య జరిగిన ఎన్నో రోడ్డు ప్రమాదాలే ఇందుకు సాక్షి. ఇకపై వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా జూన్ 1 నుంచి కొత్త వాహన చట్టాన్ని అమలులోకి వచ్చింది.



హెల్మెట్ అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న, రవాణా, పోలీసు అధికారులు

నిబంధనలు పాటించాల్సిందే...

జిల్లాలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటిచాల్సిందేనని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరిస్తున్నారు. ప్రాణం చాలా విలువైందని కొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా.. కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగులుతుండడంతో లైసెన్స్ ఉంటేనే వాహనాలను నడపాలని, ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ రోడ్డు సంకేతాలు పాటించాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వావానాలను నడపరాదని, కార్లలో సీట్ బెల్ట్ తప్పనిసరి అని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు



జిల్లాలోని వాహన యజమానులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు. మైనర్లు వాహనాలు నడిపినపుడు తమ తనిఖీల్లో పట్టుబడితే వాహన యజమానిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. ప్రతి ద్విచక్ర వాహనా దారుడు హెల్మెట్, కార్లలో సీట్ బెల్ట్ తప్పని సరిగా ధరించాల్సిందే. – ఈ.మీరా ప్రసాద్, ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్సార్ జిల్లా

సత్తా చాటిన సత్యసాయి జిల్లా ఎడ్లు



పూలసపాడులో బండ లాగుతున్న ఎద్దులు

బేస్తవారిపేట : మండలంలోని పూసలపాడులో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో సత్యసాయి జిల్లా సీకే.పల్లి మండలం పుల్లేటిపల్లికి చెందిన బొబ్బిలి భాస్కర్‌రెడ్డి ఎద్దులు 3,845 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన మార్తాల వెంకట సుబ్బారెడ్డి ఎద్దులు 3767 అడుగులు లాగి ద్వితీయ, నంద్యాల జిల్లా జిల్లా పరం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్ రెడ్డి ఎద్దులు 3250 అడుగులు లాగి తృతీయ, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం ఎ.కోడూరుకు చెందిన చాగంటి నాగమల్లిఖార్జున రెడ్డి ఎద్దులు 3143 అడుగులు లాగి నాలుగు, యర్రగొండపాలేనికి చెందిన హుస్సేన్ ఎద్దులు 3042 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.40 వేలు, 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను దాతలు పంపిణీ చేశారు.

జలాశయంలో దూకిన వృద్ధురాలు

– కాపాడిన..బోటు డ్రైవర్, లస్కర్



పోలీస్ స్టేషన్‌లో చెన్నమ్మ

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న వృద్ధురాలు చెన్నమ్మను బోటు డ్రైవర్లు కాపాడారు. ఈ సంఘటన శుక్రవారం మైలవరం మండల కేంద్రంలో చోటుచేసుకొంది. ఎస్ఐ రెడ్డిసురేష్ వివరాల మేరకు.. కర్నూలు జిల్లా చాగలమర్రి మండలం చిన్న బోధనం గ్రామానికి చెందిన చెన్నమ్మ గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మైలవరం చేరుకుని స్థానిక జలాశయంలో దూకింది. కట్టపై వెళ్తున్న బోటు డ్రైవర్ ఎన్.శ్రీనివాసరావు, లస్కర్ బెన్నయ్య జలాశయంలో దూకి వృద్ధురాలిని బయటకు తీసి కాపాడారు. వెంటనే ఆమెను పోలీసులకు అప్పగించారు. విచారించగా తనది చిన్న బోధనం గ్రామమని చెప్పారు. కుటుంబ సభ్యులను పిలిపించి విచారించగా ఎటువంటి సమస్యలు లేవని తెలిపారు. దీంతో పోలీసులు కుమారుడు, మనువండ్లకు వృద్ధురాలిని అప్పగించారు. జలాశయంలో దూకి కాపడిన శ్రీనివాసులును ఎస్ఐ రెడ్డి సురేష్ అభినందించారు.

బీజేపీకి సొంత బలం లేదు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కడప వైఎస్సార్ సర్కిల్ : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి సొంత బలం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత విపక్షాల సీఎంలను భాజపా అరెస్టు చేయించినా, రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసినా, భావోద్వేగ ప్రసంగాలు చేసినా, సీబీఐ, ఈడీలను అడ్డుపెట్టుకుని విపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేసినా బీజేపీ ప్రకటించిన 400 ఎంపీ సీట్లు సాధించలేకపోయిందన్నారు. మోదీ బ్రాండ్ విద్వేష రాజకీయాలకు దేశ ప్రజలు ×చెక్ పెట్టారన్ని గుర్తు చేశారు. రాజ్యాంగాన్నే మార్చేస్తాం, రిజర్వేషన్లు రద్దు చేస్తాం, మహిళలు, దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తాం అన్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులకు ఓటమి తప్పలేదని హెచ్చరించారు. 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి 303 సీట్లు రాగా, 2024 ఎన్నికల్లో సిట్టింగ్ 63 ఎంపీ సీట్లలో ప్రజలు ఓడించారన్నారు. దేశంలో పోలైన 64 కోట్ల ఓట్లలో మెజార్టీ ఓటర్లు ఆ పార్టీని తిరస్కరించారన్నారు. ×పార్లమెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ విచారించి షేర్ల కుంభకోణాన్ని వెలుగులోకి తీయాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అన్వేష్, ఐఎన్ సుబ్బమ్మ, మనోహర్, రామ్మోహన్ పాల్గొన్నారు.

హం దో హమారే బారా సినిమాను నిషేధించాలి



కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న అఖిల పక్ష నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : పవిత్రమైన ఖురాన్‌కు వ్యతిరేకంగా నిర్మించిన 'హం దో – హమారే బారా' సినిమాను నిషేధించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు మహ్మద్ ఆలీఖాన్ పేర్కొన్నారు. కలెక్టర్ విజయరామరాజు, ఏఎస్పీలకు శుక్రవారం ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లాం సంప్రదాయం, ముస్లిం మహిళల వ్యక్తిగత జీవితాలను వక్రీకరిస్తూ అన్నుకపూర్ తీసిన సినిమా వారి మనోభావాలను గాయపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్లాం సంప్రదాయంపై ఇష్టం వచ్చిన భావజాలంతో చిత్రాన్ని నిర్మించిన నిర్మాత, దర్శకులు, నటీనటులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీఖాన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు, ప్రముఖ సంఘ సేవకుడు సలావుద్దీన్, జేఏసీ జిల్లా కన్వీనర్ బాబుభాయ్, మత గురువు అబ్దుల్ రెహమాన్, ఎ మైనార్టీ ఫోరం రైట్స్ నేత దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

మైదుకూరు : కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ షేక్ మాసూంబాషా ఆధ్వర్యంలో కడప విజిలెన్స్ అధికారులు, పౌర సరఫరాల అధికారులుపలు రైస్‌మిల్లుల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మైదుకూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీ గణేశా మెగా మోడరన్ రైస్ మిల్, శ్రీలక్ష్మీ సుబ్బరాయ మోడరన్ రైస్‌మిల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లుల్లో నిల్వలు చూసి రికార్డులను పరిశీలించారు. బియ్యపు బస్తాలపై ప్యాకేజీ డిక్లరేషన్ లేకపోవడం, ప్యాకింగ్ మిషన్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ లేనట్లు గుర్తించి రూ.75వేల అపరాధ రుసుం విధించారు. నేమ్ బోర్డులు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ప్రదర్శించకపోవడంతో రూ.లక్ష అపరాధ రుసుం విధించారు. కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మాసూంబాషా మాట్లాడుతూ మిల్లుదారులు ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను పాటించకపోయినా, అవకతవకలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐలు టి.రెడ్డప్ప, జి.ఈదురుబాషా, సివిల్ సప్లైస్ డీఎం డి.అర్జున్‌రావు, ఏఎస్ఓ సి.తారకనాథరెడ్డి, లీగల్ మెట్రాలజీ సహాయ కంట్రోలర్ కేజే రవీంద్రా రెడ్డి పాల్గొన్నారు.

చౌక దుకాణంలో తనిఖీలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులోని బాషా చౌక దుకాణాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చాముండేశ్వరి శుక్రవారం తనిఖీ చేశారు. కేటాయించిన వాటికంటే అదనంగా నాలుగు బస్తాల బియ్యం ఉన్నాయని, డీలర్‌పై చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు సుదర్శన్, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, ఎఫ్ఐ సాయిప్రసాద్‌రావు బియ్యాన్ని తూకంవేసి మరో రేషన్ షాప్‌లో నిల్వచేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి కోరారు. కడప ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో అనారోగ్య కారణాలతో గైర్హాజరైన ఉద్యోగులకు కలెక్టర్లు ఇచ్చిన చార్జి మెమోలను వెనక్కు తీసుకోవాలన్నారు. 12వ పీఆర్‌సీ అమలులో భాగంగా తక్షణమే మధ్యంతర భృతి ప్రకటిచాలన్నారు. 117 జీవో రద్దు చేసి ఇంగ్లీష్ మీడియంతోపాటు, తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌బాబు, రమణారెడ్డి, బాలగంగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రహ్మణ్యం, రవిశంకర్‌రెడ్డి, శివారెడ్డి, రీజినల్ కన్వీనర్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, సాధిక్‌అలీ, మాజీ ఎంఈఓ రత్నస్వామి పాల్గొన్నారు.

కల్తీ డీజిల్ సరఫరాపై ఆరోపణ

ముద్దనూరు : మండలంలోని ఓ పెట్రోల్ బంక్‌లో కల్తీ డీజిల్ సరఫరా చేశారని వినియోగదారుడు శుక్రవారం ఆరోపించారు. కలమల్ల గ్రామానిక చెందిన సంజీవరెడ్డి తమ టిప్పర్ వాహనానికి రూ.10వేల విలువ చేసే 100 లీటర్ల డీజిల్ పట్టించుకున్నాడు. అయితే కొద్ది దూరం ప్రయాణించేసరికి వాహనం నిలిచిపోయింది. దీంతో మెకానిక్‌ను ఆశ్రయించగా, ట్యాంకులో డీజిల్‌ను పరిశీలిస్తే నీరు చేరిందని తెలిపారు. కల్తీ డీజిల్ సరఫరా చేశారని ఆయన ఆరోపించారు.

బైపాస్ రోడ్డులో ఘర్షణ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మోడంపల్లె బైపాస్ రోడ్డులోని సినీ హబ్ సమీపంలో జరిగిన దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ఇస్లాంపురం వీధికి చెందిన షేక్ సొహైల్ తన మిత్రులతో కలిసి శుక్రవారం సాయంత్రం బైపాస్ రోడ్డులో ఉన్న టీ దుకాణానికి వెళ్లారు. అతడు టీ తాగుతుండగా అవతార్, జాఫర్ తదితరులు వచ్చారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని జరిగిన దాడిలో సొహైల్ తలకు గాయమైంది. స్నేహితులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ప్రాసెసింగ్ ఫుడ్‌కు ఫుల్‌స్టాప్

నేటి ఆధునిక యుగంలో చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు ప్రతి ఒక్కరూ ప్రాసెస్సింగ్ ఫుడ్ తినేందుకే ఇష్టపడుతున్నారు. ఆహార పదార్థాలకు మసాలాల మెరుగుదిద్ది అందమైన కవర్లలో ప్యాక్ చేసిన ఆహారాన్ని కొని తినేందుకు చాలామంది మొగ్గుచూపుతున్నారు. ఈ ఫుడ్ తినడంతో నాలుకకు రుచి తగులుతుండడ తప్ప మరెలాంటి లాభం ఉండదని పోషక నిపుణులు చెబుతున్నారు. ఇది గమనించిన ప్రకృతి సేద్య విభాగం విశ్రాంత ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ విజయ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయ విభాగం ద్వారా పురుగు మందులు, రసాయన ఎరువులు వాడని ఆహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు.

- పోషకాహార వినియోగంపై ప్రకృతి సేద్య విభాగం ప్రచారం
- డోర్ టు డోర్ డెలివరీకి హెల్త్ అండ్ న్యూటీషియన్ చర్యలు
- విద్యావంతులైన ఎన్ఎఫ్ఎఫ్‌ల నియామకం
- మహిళా మార్టులలో ఉత్పత్తుల అమ్మకాలకు చర్యలు



కడప కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో 50 సెంట్ల లోపు స్థలంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు పండించే దిగుబడులకు అధిక ధర కల్పించేందుకు ప్రకృతి సేద్య విభాగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. సాగు చేసిన ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో చిన్న చిన్న దుకాణాల్లో ఉత్పత్తుల అమ్మకాలు చేపడుతున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నారు. నాబార్డు వారి మేళా, గ్రామాల్లో జరిగే వారపు సంతల్లోనూ, మహిళా సంఘాలు, జిల్లా సమాఖ్యలతో కలిసి ఆర్గానిక్ మేళాలు నిర్వహించి ఉత్పత్తులను ప్రదర్శించాలని నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్నారు. జగనన్న చేయూత మహిళా మార్టులలో ప్రత్యేక ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకపు కౌంటర్ కొనసాగిస్తున్నారు.

డోర్ టు డోర్ డెలివరీ..

జిల్లా వ్యాప్తంగా అన్ని కుటుంబాలు ఫుడ్ ప్లేట్ డైవర్సిఫికేషన్ కలిగి ఉండడానికి అంగన్‌వాడీ, పాఠశాలల్లో మెరుగైన పోషకాహార వినియోగం కోసం, స్థానిక మార్కెట్‌తో ఆహార అనుసంధానం ఏర్పాటుచేస్తున్నారు. పోషకకరమైన ఆహారాన్ని డోర్ టు డోర్ అందించడానికి హెల్త్ అండ్ న్యూట్రీషియన్‌లో విద్యావంతులైన ఎన్ఎఫ్ఎఫ్‌లను నియమించారు. కేటాయించిన గ్రామాలలో ఉంటూ అక్కడి ప్రతి కుటుంబం ఆహార అలవాట్లు మార్పించి శరీరానికి ఏది అవసరమో తెలియ జేస్తున్నారు. వీఐపీలకు సంబంధించిన ముఖ్యమైన వేడుకల్లో కాఫీ, టీ స్థానంలో రాగి జావ, మిల్లెట్ మాల్ట్, చిరు ధాన్యాల పౌష్టికాహారాన్ని అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తాం



ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. గ్రామాల్లో నిరంతరం ప్రజలకు ఆహార అలవాట్లపై కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ఆరోగ్యకరమైన పోషకాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి సహజ పద్ధతులను అనుసరించడం ద్వారా కలిగే మేలు గురించి వారికి తెలియచేస్తున్నాం. – ప్రజ్వని, హెల్త్ అండ్ న్యూట్రీషియన్, ప్రకృతి వ్యవసాయ సేద్య విభాగం

గడ్డి తింటున్న పశువులు కూడా...



గడ్డి, పొట్టు తింటున్న పశువులు ఆరోగ్యంగా ఉంటున్నాయి, పాలిష్ చేస్తే వచ్చే మల్లెపువ్వు లాంటి బియ్యం తింటున్న మనుషులు మాత్రం రోగాలతో ఇబ్బంది పడుతున్నారు. పురుగుముందులు, రసాయన ఎరువులు వాడని ఉత్పత్తులను తీసుకోవాలి. దీనినే ప్రతి ఒక్కరి జీవిత లక్ష్యంగా చేసుకోవాలి. మంచి పౌష్టికాహారం అందిస్తే అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు వీలవుతుంది. – ఎం.శ్రీనాథ్‌రెడ్డి, మార్కెటింగ్ అండ్ సర్టిఫికేషన్, ప్రకృతి వ్యవసాయ సేద్య విభాగం

జీవితంలో ధనం, హోదా ఒక భాగమే

ప్రతి ఒక్కరికి జీవితంలో ధనం సంపాదించడం, హోదాను పెంచుకోవడం అనేది ఒక భాగం మాత్రమే. ఆరోగ్యం ప్రతి ఒక్కరి జీవిత లక్ష్యంగా చేసుకుని మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. అందుకోసమే ప్రకృతి వ్యవసాయం చేసి ఆ దిగుబడులను తినే అలవాటు చేయిస్తున్నాం. ఇందుకోసం స్టాల్స్‌లో ప్రజలకు అన్ని రకాల వస్తువులను అందుబాటులో ఉంచాం. – రామక్రిష్ణరాజు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయ సేద్య విభాగం